# నో అడ్మిషన్స్

- ధరూర్ జెడ్పీ హై స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య ఫుల్
- తల్లిదండ్రులు సహకరించాలని బోర్డు ఏర్పాటు చేసిన హెచ్‌ఎం



ధరూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల

ధరూర్, జూలై 3 : ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసింది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు, సకల సౌకర్యాలు కల్పించింది. డిజిటల్ విద్యాబోధన, స్మార్ట్ క్లాసుల నిర్వహణ, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన, కొత్త భవనాలతో బడుల రూపు మారింది. ఇంగ్లిష్ మీడియంతోపాటు ఉచితంగా యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేస్తున్నది. మన ఊరు-మనబడి, మన బస్తీ-మన బడి కార్యక్రమం సత్ఫలితాన్నిస్తున్నది. ప్రైవేటుకు దీటుగా సర్కార్ బడుల్లో విద్యాబోధన జరుగుతున్నది. దీంతో సర్కార్ స్కూళ్లకు క్రేజ్ పెరిగింది. విద్యార్థులు భారీగా చేరుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన 20 రోజుల్లోనే చాలా పాఠశాలల్లో ప్రవేశాలు నిండిపోతున్నాయి. తాజాగా జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పది రోజుల కిందటే అడ్మిషన్లు ఫుల్ అయ్యాయి. సోమవారం ధరూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి



పాఠశాల ఎదుట ఏర్పాటు చేసిన నో అడ్మిషన్స్ బోర్డు

10వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య నిండిపోయింది. దీంతో హెచ్‌ఎం నాగేటి ప్రతాపరెడ్డి పాఠశాల గేట్ వద్ద నో అడ్మిషన్ బోర్డును ఏర్పాటు చేశారు. ఇప్పటికే 75 నుంచి 105 మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని హెచ్‌ఎం తెలిపారు. తరగతి గదులు పూర్తిగా కిక్కిరిసిపోయాయని, బెంచీలు సరిపోవడం లేదని, గరిష్ఠ స్థాయికి మించి చేరారని ఆయన తెలిపారు. మొత్తం 1,100 మంది స్టూడెంట్స్ ఉన్నారని, అందుకే కొత్తగా అడ్మిషన్స్ తీసుకోలేకపోతున్నామన్నారు. ఒకవేళ ప్రత్యేక పరిస్థితులు కల్పిస్తే ఆలోచిస్తామని సూచించారు. తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు. గతంలో విద్యార్థుల సంఖ్య లేక చాలా ప్రాంతాల్లో బడులు మూతబడుతుంటే నేడు సీఎం కేసీఆర్ తీసుకున్న సంస్కరణలతో పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అభివృద్ధి, సంక్షేమంలో మనమే టాప్

- ముచ్చటగా మూడోసారి అధికారం బీఆర్‌ఎస్‌దే..
- గులాబీ గూటికి చేరిన ఊర్కొండపేట కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు
- పార్టీలోకి ఆహ్వానించిన జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కల్వకుర్తి(ఊర్కొండ), జూలై 3 : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్ స్థానంలో ఉందని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఊర్కొండ మండలం ఊర్కొండపేటకు చెందిన దాదాపు 100మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ 70ఏండ్లలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేయలేని అభివృద్ధిని 9ఏండ్లలోనే చేసి చూపామన్నారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ నిలిచిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై.. అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు కాంగ్రెస్, బీజేపీ ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలకు కాలం చెల్లిందన్నారు. పార్టీలో అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని తెలిపారు. పార్టీ అభ్యున్నతికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ కలిసికట్టుగా ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఊర్కొండ మండల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

# ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తాం

- ఉంద్యాల గ్రావిటీతో మూడు చెరువులను నింపుతాం
- అదనంగా 2వేల ఎకరాలు సాగులోకి..
- సాయిచంద్ మరణం తీరనిలోటు
- ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట)/మక్తల్ టౌన్, జూలై 3 : ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండలం ఉంద్యాల వద్ద ఫేజ్-1 పంప్‌హౌస్ నుంచి కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డితో కలిసి నీటిని విడుదలను ప్రారంభించారు. అలాగే ఉంద్యాల పంప్‌హౌస్ నుంచి జమ్మికుంట, నల్లకుంట, ఎర్రకుంట చెరువులకు నీటి తరలింపునకుగానూ కాల్వ ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలించారు. కాల్వ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. కాల్వ నిర్మాణంతో అదనంగా 2వేల ఎకరాలు సాగులోకి రానున్నట్లు తెలిపారు. కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఉంద్యాల పంప్‌హౌస్ నుంచి ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యమైన కారణంగా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం


కృష్ణాజలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు ఆల, చిట్టెం



సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు ఆల, చిట్టెం, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి

జూరాలకు ఇన్‌ఫ్లో లేనందున ఒకే మోటరుతో నీటిని తరలిస్తున్నామని, భారీ వర్షాలు కురిస్తే రెండు మోటర్లతో పర్దీపూర్ రిజర్వాయర్‌ను నింపనున్నట్లు తెలిపారు. అంతకుముందు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ దివంగత సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిచంద్ అకాల మృతి రాష్ట్రానికి తీరనిలోటని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల ప్రగతిపై ప్రత్యేక దృష్టి

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత, జూలై 3 : పల్లెల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి నిధులను కేటాయిస్తున్నట్లు మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చెప్పారు. అమరచింత మండలం మస్తీపూర్‌లో రూ.20లక్షలతో పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల సుందరీకరణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతున్నదని తెలిపారు. తెలంగాణ వచ్చాక గ్రామాల రూపురేఖలు మారిపోయాయన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను సర్పంచ్ సుజాత, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మాజీ వైస్‌చైర్మన్ నాగభూషణం గౌడ్, మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు మునీందర్, శివుడు తదితరులు పాల్గొన్నారు.


మస్తీపూర్‌లో జీపీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం

## అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి..

- ఎమ్మెల్యే ఆల సమక్షంలో గులాబీ గూటికి చేరిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు


గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర రూరల్(చిన్నచింతకుంట), జూలై 3 : సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండలం ఉంద్యాలకు చెందిన 30మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 70ఏండ్లుగా వెనుకబడిన రాష్ట్రాన్ని కేవలం 8ఏండ్లల్లోనే అన్నిరంగాల్లో తీర్చిదిద్ది దేశంలోనే నెంబర్‌వన్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతున్నదన్నారు. బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోట రాము పాల్గొన్నారు.

## వ్యక్తి దారుణ హత్య

కొత్తకోట, జూలై 3 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కావలి భారతయ్య (55) దారుణ హత్యకు గురయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం కొత్తకోట పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. జూన్ 26న భారతయ్య కొత్తకోట నుంచి అప్పరాలకు వెళ్లి రోడ్డు పక్కన నిలబడగా, రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్‌గౌడ్ కారులో వచ్చి కిడ్నాప్ చేశాడు. కారులోనే మెడకు టవల్ చుట్టి ఇనుపరాడుతో బాదడంతో మృతి చెందాడు. శవాన్ని కనుమరుగు చేయాలనే ఉద్దేశంతో కొత్తకోట నుంచి బెంగళూరు వైపు వెళ్లాడు. కర్నూల్ దాటిన తర్వాత ఉల్లందుకోడ్ సమీపంలోని గుట్టల్లో అదేరోజు సాయంత్రం మృతదేహంపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఇందుకు వనపర్తి పట్టణానికి చెందిన మహ్మద్‌షఫీ సహకరించాడు. మృతుడి తమ్ముడు సవారయ్య ఫిర్యాదు మేరకు జూన్ 27న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు..నిందితులను అరెస్టు చేసి ఆత్మకూర్ కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా పాత కక్షలతోనే భారతయ్యను రవీందర్‌గౌడ్ హతమార్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై మంజునాథ్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామి, చంద్రమోహన్, కురుమయ్యగౌడ్, మురళీధర్‌రెడ్డి, సాయిబాబా, యుగంధర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.